## క్లుప్తంగా

### వెంకన్న భక్తులకు అన్నసమారాధన



**గుడ్లవల్లేరు:** డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవాల్లో భాగంగా స్వామిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులకు శనివారం భారీ అన్నసమారాధనను నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ ప్రతినిధి పురిటిపాటి వీరారెడ్డి, విజయలక్ష్మి దంపతుల చేతుల మీదుగా ప్రారంభించారు. మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధా రెడ్డి ఆర్థిక సాయంతో జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

### కూచిపూడిలో 'వృక్షారోహణం'



**కూచిపూడి(మొవ్వ):** నాట్య క్షేత్రమైన కూచిపూడిలో శనివారం విశ్వహిందూ పరిషత్ బజరంగ్ సేవా సప్తహం కార్యక్రమంలో భాగంగా వృక్షారోహణం కార్యక్రమాలు నిర్వహించారు. గంగానమ్మ తల్లి మందిరం వద్ద మొక్కలు నాటే కార్యక్రమం నిర్వహించారు. కూచిపూడి నాట్యాచార్యులు కళా రత్నం డాక్టర్ వేదాంతం రాధేశ్యాం ముఖ్య అతిథిగా పాల్గొని మొక్కలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎస్ఆర్ ఆంజనేయులు పాల్గొన్నారు.

### అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

**ముదినేపల్లి రూరల్ :** స్థానిక ప్రభుత్వ కళాశాలలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ పోస్టుల్లో గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు ప్రిన్సిపాల్ ఓఎస్ఎన్ మూర్తి తెలిపారు. బోటనీ సబ్జెక్టులో ఖాళీగా ఉన్న ఈ పోస్టులకు పోస్టు గ్రాడ్యుయేషన్‌లో సంబంధిత సబ్జెక్టులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధించినవారు అర్హులన్నారు. ఈ నెల 15లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్వ్యూ, డెమో క్లాసులు నిర్వహించే తేదీలను దరఖాస్తుదారులకు ఫోన్ ద్వారా సమాచారం అందిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు కళాశాల కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

### పంటల ఎదుగుదలకు కోడిగుడ్డు, నిమ్మరసం



**మండవల్లి:** పంటల ఎదుగుదలకు గ్రోత్ ప్రమోటర్ కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం ఉపయుక్తంగా ఉంటుందని ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ గౌతమ్‌కుమార్ అన్నారు. మండవల్లి మండలం అల్లినగరంలో శనివారం గౌతమ్ న్యాచురల్స్ అండ్ ఆర్గానిక్స్ ప్రకృతి వ్యవసాయ వనరుల, ఉత్పత్తుల కేంద్రం వద్ద ఖరీఫ్ సీజన్‌లో వరి పంటకు కావాల్సిన గ్రోత్ ప్రమోటర్ కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం తయారు చేశారు. కోడిగుడ్డు, నిమ్మరసం ద్రావణం 250 ఎంఎల్ 100 లీటర్ల నీటిలో కలిపి ఎకరం పంటపై పిచికారీ చేయడం వల్ల మొక్కల ఎదుగుదలకు, పూత పిందెకు, పంటల నాణ్యతకు ఉపయోగపడుతుందని గౌతమ్‌కుమార్ వివరించారు. యూనిట్ ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీ సుధాకర్ రైతులు పాల్గొన్నారు.

### నేడు ఉచిత కంటి వైద్యశిబిరం

**కూచిపూడి(మొవ్వ):** మొవ్వ మండల రెడ్ క్రాస్ సొసైటీ, కూచిపూడి రోటరీ క్లబ్‌ల ఆధ్వర్యంలో కూచిపూడి రవి ప్రకాష్ సిలికానాంధ్ర సంజీవిని వైద్యాలయంలో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ శిబిరంలో సమతా శంకర నేత్ర వైద్యాలయం(ఉయ్యూరు) డాక్టర్ హర్షిత వైద్య పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు.

**గుడ్లవల్లేరులో..**

**గుడ్లవల్లేరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ గుడ్లవల్లేరు వారి ఆధ్వర్యంలో స్థానిక లయన్స్ సేవాభవన్‌లో ఆదివారం ఉచిత మధుమేహ వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని శనివారం లయన్స్ చైర్మన్ నిమ్మగడ్డ శశికళ తెలిపారు.

### పేదలకు దుప్పట్లు అందజేత

**గుడ్లవల్లేరు:** గుడ్లవల్లేరులో హై 5 యూత్ ఫౌండేషన్ గౌరవ సలహాదారురాలు తెలంగాణ రాష్ట్ర సిటీ స్మాల్ కాజల్ కోర్ట్ సీనియర్ సూపరింటెండెంట్ డాక్టర్ పీవీపీ అంజనీకుమారి పుట్టినరోజు సందర్భంగా పేదలకు శనివారం దుప్పట్లను అందజేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు డాక్టర్ గోట్రు నాగబాబు, సెక్రటరీ కళివరపు రంగారావు, సభ్యులు మద్దాల వెంకటేశ్వరరావు, గురజ సాంబశివరావు, బోడపాటి రాజకుమార్, దేవి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

# క్షీణించిన పారిశుద్ధ్యం



మండవల్లిలో రోడ్డుపక్కన వేసిన చెత్త



పెరికెగూడెం రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త

- ఎక్కడి మురుగు అక్కడే..
- ప్రజలకు వ్యాధుల భయం

**మండవల్లి :** మండలంలోని పలు గ్రామాల్లో పారిశుద్ధ్యం క్షీణించింది. ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్లు చెత్తా చెదారం, మురుగు నీటితో అధ్వానంగా మారాయి. దోమలు విజృంభిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వ్యాధులు ప్రబలే ప్రమాదం పొంచి ఉందని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని మండవల్లి, పెరికెగూడెం, కానుకొల్లు తదితర గ్రామాలు రోడ్డు వెంబడి చెత్త కుప్పలతో కంపు కొడుతున్నాయి. డ్రెయినేజీల్లో పూడిక పేరుకుపోయి మురుగునీరు ఎక్కడికక్కడ నిల్వ ఉండి దోమలు విజృంభిస్తున్నాయి. సమస్యను పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా స్పందన లేదని ప్రజలు వాపోతున్నారు. దోమలు కుట్టి వ్యాధుల బారినపడితే తమ పరిస్థితి ఏంటని వారు అధికారులను ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి వెంటనే పారిశుద్ధ్యాన్ని మెరుగుపరచేందుకు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

## వరి సాగులో వలస కూలీల హవా!



వరినాట్లు వేస్తున్న మహిళలు

**గుడ్లవల్లేరు:** గుడివాడ నియోజకవర్గంలో కొన్నేళ్లగా వరినాట్లు వేయడంలో స్థానికంగా ఎదురవుతున్న కూలీల కొరతను వలస కూలీలు చాలా వరకూ తీరుస్తున్నారు. ఈ ఏడాది కూడా ఖరీఫ్ వరి సాగులో వారి హవా కొనసాగుతోంది. స్థానికంగా రోజు వారీ పనులుగా కాకుండా ఎకరానికి బిల్లు మగతాకు రూ.4,500 తీసుకుని వరినాట్లు వేయటంతో పాటు దారులు కూడా అదే కూలీలు తీస్తున్నారు. కూలి ఇచ్చే పరంగా అయితే మహిళలకు ఒక్కొక్కరికి రూ.400, మగవారికి రూ.600 నుంచి రూ.700 కూలి చెల్లించాల్సి వస్తోంది. ఈ విధంగా కూడా ఎకరానికి రూ.3,200 నుంచి రూ.4వేలు తీసుకుంటున్నారు. కాంట్రాక్ట్ పద్ధతిలో తీసుకునే కూలీల కంటే వలస కూలీలు వరినాట్లు వేసే విధానం ఒక క్రమ పద్ధతిలో ఉండడంతో దిగుబడులు పెరగడానికి తోడ్పడుతుందని రైతులు విశ్వసిస్తున్నారు.

**వలస కూలీలతోనే నాట్లు**

కూలి రేట్లు ఎక్కువ.. తక్కువ అని ఆలోచించకుండా వలస కూలీలతోనే నాట్లు వేయించేందుకు అధిక శాతం రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. తక్కువ కాల వ్యవధి రకాల వరినారుకే రైతులు ప్రాధాన్యం ఇస్తున్నారు. ఈ నెలాఖరులోగా పూర్తి స్థాయిలో వరినాట్లు పూర్తయ్యే అవకాశం ఉందని ఏఓ ఎల్.సునీల్ తెలిపారు. సార్వా సీజన్‌లో వరిసాగును శాస్త్రీయ పద్ధతిలో చేసి, మంచి దిగుబడులు పొందాలని రైతులకు సూచించామని పేర్కొన్నారు. విత్తన శుద్ధి, నారుమడి యాజమాన్యం, జింకు లోప నివారణ చర్యలు, ఎరువులు, పురుగు మందుల వాడకం తదితర వాటిపై రైతులకు అవగాహన కల్పించామని తెలిపారు.

**54వేల ఎకరాల్లో వరి సాగు**

గుడివాడ నియోజకవర్గంలోని సుమారు 54వేల ఎకరాల్లో ఖరీఫ్ వరి సాగు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. సాగునీటి సదుపాయాలున్న ప్రాంతాల్లో వరి నాట్లు వేయడం దాదాపు పూర్తి కావొస్తుంటే... మిగిలిన ప్రాంతాల్లో కాస్త నెమ్మదిగా నాట్లు వేయడం ప్రారంభించారు. ఈ క్రమంలో గుడ్లవల్లేరు, గుడివాడ రూరల్, నందివాడ మండలాల్లోని గ్రామాల్లో రైతులు వరినాటుల్ వేస్తున్నారు. కొన్ని చోట్ల ఇప్పటికే వెదజల్లు పద్ధతినే చేపట్టారు. కొన్ని గ్రామాలు నాట్లు వేయటంలో వెనుకబడ్డాయి. ఆలస్యం కావడంతో నాట్లు పడటంలో కూడా జాప్యం జరుగుతోంది.

## మహిళా నాయకురాలిపై దాడి దారుణం



జెట్టి గురునాథరావు

**గుడివాడ టౌన్:** ప్రజాస్వామ్యంలో మహిళకు ప్రత్యేక స్థానం ఉన్న దేశంలో కూటమి పాలనలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని వైఎస్సార్ సీపీ కృష్ణా జిల్లా పరిశీలకుడు జెట్టి గురునాథరావు అన్నారు. శనివారం జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, పెడన నియోజకవర్గ ఇన్‌చార్జి ఉప్పాల రాములపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ పాలనలో ప్రజాస్వామ్యం ఖూనీ అయిందని పేర్కొన్నారు. జిల్లా స్థాయి మహిళా ప్రజాప్రతినిధికే ఈ రాష్ట్రంలో రక్షణ కరువైతే సామాన్య మహిళల పరిస్థితి ఏవిధంగా ఉంటుందో ప్రజలు గుర్తించాలన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం

**పోలీసు, రెవెన్యూ, ఇంజినీరింగ్ అధికారులతో సమీక్ష**



సమావేశంలో మాట్లాడుతున్న ఈఓ శీనానాయక్

**ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):** ఇంద్రకీలాద్రి కొండ దిగువన ఆధ్యాత్మిక వాతావరణం, ఆలయ సంస్కృతి ప్రతిబింబించేలా చర్యలు తీసుకుందామని దుర్గగుడి ఈఓ శీనానాయక్ పేర్కొన్నారు. ఇంద్రకీలాద్రిపై మహా మండపం నాల్గో అంతస్తులోని ఈవో చాంబర్‌లో శనివారం పోలీసు, దేవస్థాన ఇంజినీరింగ్, వైదిక సిబ్బందితో సమావేశం నిర్వహించారు. హైదరాబాద్ వైపు నుంచి విచ్చేసే భక్తులు కొండపైకి చేరుకునేందుకు ఇబ్బందులకు గురవుతున్నారని ఈఓ పోలీసు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. భక్తులు కొండపైకి చేరుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచన చేయాలన్నారు. ముఖ్యంగా టోల్‌గేట్ మార్పు చేయడం గురించి చర్చించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద పార్కింగ్ పాయింట్, కనకదుర్గనగర్, దుర్గాఘాట్‌లో సమాచార కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏడీసీపీ జి.రామకృష్ణ, వెస్ట్ ఏసీపీ దుర్గారావు, దుర్గగుడి ఏసీ రంగారావు, ఈఈ కోటేశ్వరరావు, డీఈలు, ఏఈవోలు రమేష్‌బాబు, తిరుమలేశ్వరరావు, వెంకటరెడ్డి, గంగాధర్, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్ పాల్గొన్నారు.

## ఫొటోలకే పరిమితమైన సాగునీరు



విలేకరులతో మాట్లాడుతున్న ఆర్‌సీపీ రెడ్డి

**గుడివాడ టౌన్:** వ్యవసాయ అవసరాలకు కావాల్సిన సాగునీరు సరఫరా చేయడంలో కూటమి ప్రభుత్వం విఫలం అయిందని సీపీఎం పట్టణ కార్యదర్శి ఆర్‌సీపీ రెడ్డి అన్నారు. శనివారం స్థానిక సీపీఎం కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాగుకాలం ప్రారంభమైనా ప్రభుత్వం నీటిని సకాలంలో అందించలేకపోతుందన్నారు. నీటిని విడుదల చేసినట్లు వీడియోలు తీసి సోషల్ మీడియాలో ప్రకటించడం మినహా కావాల్సిన సాగునీరు రైతులకు అందడంలేదన్నారు. దీంతో నీరు అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని, ఇప్పటికైనా ప్రభుత్వం కన్ను తెరచి సాగుకు కావాల్సిన నీరు అందజేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు ఎస్. ఉమామహేశ్వరరావు, రైతు ఎస్. శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణకు 'స్టాప్ వాష్ రిఫ్రెష్ అండ్ గో'



జాతీయ రహదారులపై బస్సు డ్రైవర్లకు నీటిని అందజేస్తున్న పోలీసులు

**లబ్బీపేట(విజయవాడతూర్పు):** వేకువ జామున నిద్రమత్తులో జరుగుతున్న ప్రమాదాలను నివారించడానికి పోలీసులు 'స్టాప్ వాష్.. రిఫ్రెష్ అండ్ గో' నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా అర్ధరాత్రి దాటిన తర్వాత 2 గంటల నుంచి 5 గంటల మధ్య కాలంలో ఎన్టీఆర్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని పలు జాతీయ రహదారులపై వాహనాలను ఆపి, వారు నీటితో ముఖం వాష్ చేసుకుని తిరిగి ప్రయాణించేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. అందులో బాగంగా శుక్ర, శనివారాల్లో తిరువూరు, జి.కొండూరు జాతీయ రహదారులపై భవానీపురం, గొల్లపూడి హైవేల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. నిద్రలేకుండా ఎక్కువ దూరం ప్రయాణించే వాహన డ్రైవర్లు తెల్లవారు జామున నిద్రలోకి జారుకుంటున్నారని అందుకే ఈ కార్యక్రమం నిర్వహించాలని సీపీ రాజశేఖరబాబు ఆదేశాలు జారీ చేశారు.

### సరిహద్దు వివాదంలో వ్యక్తిపై దాడి

**ముదినేపల్లి రూరల్ :** పొలం సరిహద్దు వివాదంలో వ్యక్తిపై ఇద్దరు దాడి చేసిన ఘటనకు సంబంధించి స్థానిక పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ముదినేపల్లి మండలం పెదగొన్నూరుకు చెందిన బత్తుల వెంకట రామారావు పొలం పనులు చేస్తుండగా అదే గ్రామానికి చెందిన శ్రవణం రామకృష్ణ, సతీష్ రామరావు వద్దకు వచ్చి పొలం సరిహద్దు విషయమై గొడవ పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో ఇద్దరి మధ్యా మాటామాటా పెరగడంతో రామకృష్ణ, సతీష్‌లు కర్రతో రామారావుపై దాడి చేసి గాయపరిచినట్లు తెలిపారు. రామారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వీరభద్రరావు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### శాకంబరిగా గంగానమ్మ దర్శనం



**ముదినేపల్లి రూరల్ :** మండలంలోని పెదపాలపర్రు గంగానమ్మ ఆలయంలో అమ్మవారిని గ్రామస్తులు శనివారం వివిధ రకాల పూలు, పండ్లు, కూరలతో శాకంబరీ దేవిగా అలంకరించారు. కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకుడు భుజంగ వెంకట నరసింహారావు ఆధ్వర్యంలో అలంకరించి పూజలు చేయగా శ్రీసత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో అమ్మవారిని భక్తిపాటలతో కొలిచారు.

### డ్రోన్ కెమెరాల నిఘాతో జూదరులకు చెక్



**భట్లపెనుమర్రు(మొవ్వ):** డ్రోన్ కెమెరాల సాయంతో జూదానికి, అసాంఘిక కార్యక్రమాలకు చెక్ పెడుతున్నట్లు ఎస్ఐ కేఎన్ విశ్వనాథ్ తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూచిపూడి పోలీస్‌స్టేషన్ పరిధిలోని మొవ్వ మండలం భట్లపెనుమర్రులో ప్రయోగాత్మకంగా నిర్వహించిన డ్రోన్ కెమెరాల నిఘాతో సత్ఫలితం లభించిందని పేర్కొన్నారు. మారుమూల పురాతన ఇంట్లో పేకాట ఆడుతున్న ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకుని, రూ. 2,430 స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

### దరఖాస్తుల ఆహ్వానం

**పాయకాపురం(విజయవాడరూరల్):** పాయకాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జె.సంధ్య మాధురి శనివారం తెలిపారు. సంస్కృతం పోస్ట్ ఖాళీగా ఉందని పేర్కొన్నారు. సంస్కృతంలో పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం పైన మార్కులు సాధించిన వారు అర్హులని తెలిపారు. అభ్యర్థులు ఈ నెల 15వ తేదీ లోపు దరఖాస్తులు కళాశాల కార్యాలయంలో అందజేయాలన్నారు. 16న ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొస్తే డెమో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని పేర్కొన్నారు.

### వైభవంగా పూర్ణాహుతి



**గుడివాడ టౌన్:** స్థానిక పామర్రు రోడ్డులోని శ్రీ ద్వారకా సాయి సేవాసమితి ఆధ్వర్యంలో ఉప ఆలయమైన శ్రీ షిర్డీ సాయి మందిరంలో పూర్ణాహుతి కార్యక్రమం శనివారం వైభవంగా జరిగింది. వేదపండితుల మంత్రోచ్ఛరణల మధ్య అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురు పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని శ్రీ షిర్డి సాయిబాబా మందిరంలో నిర్వహించిన కార్యక్రమాలలో భాగంగా హోమం నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు దండమూడి సీతారామస్వామి, వైస్ ప్రెసిడెంట్ మరీదు శ్రీనివాసరావు, ద్వారకా సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

## ముదినేపల్లి బస్టాండ్ అభివృద్ధికి కృషి



ముదినేపల్లి బస్టాండ్‌లో మరుగుదొడ్లను పరిశీలిస్తున్న డీపీటీఓ

**ముదినేపల్లి రూరల్ :** ముదినేపల్లి బస్టాండ్ అభివృద్ధికి కృషి చేస్తానని జిల్లా ప్రజా రవాణా అధికారి(డీపీటీఓ) ఎస్‌కే షబనాం తెలిపారు. స్థానిక బస్టాండ్‌ను డీపీటీఓతో పాటు ఏలూరు డిపో మేనేజర్ శనివారం పరిశీలించారు. బస్టాండ్‌లో మరుగుదొడ్ల నుంచి దుర్గంధం వెదజల్లుతోందని స్థానికుడు బి.విజయసాగర్ తెలిపారు. తాగునీటి సౌకర్యం లేక ప్రయాణికులు పడుతున్న ఇబ్బందులను వివరించాడు. కంట్రోలర్ వద్ద కోటేశ్వరరావు నుంచి పలు వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా షబనాం మాట్లాడుతూ జిల్లాకు శివారున ఉన్నప్పటికీ బస్టాండ్‌ను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారానికి స్థానిక పంచాయతీ నుంచి పైప్‌లైన్ కనెక్షన్ వెంటనే తీసుకోవాలని ఏలూరు డిపో మేనేజర్‌ను ఆదేశించారు. ఇతర సమస్యలను పరిష్కరించి బస్టాండ్‌ను ప్రయాణికులకు అనువుగా తీర్చిదిద్దుతామని తెలిపారు. డీపీటీఓ వెంట పీఆర్వో కేఎన్‌వీ నరసింహం ఉన్నారు.

## 17న మాదిగల విజయోత్సవ సభ



గుడ్లవల్లేరులో కరపత్రాలను ఆవిష్కరించిన నాయకులు

**గుడ్లవల్లేరు:** విజయవాడలో ఈ నెల 17వ తేదీన నిర్వహించనున్న మాదిగల విజయోత్సవ సభకు తరలిరావాలని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పిలుపునిచ్చింది. స్థానిక అంబేడ్కర్ విగ్రహం వద్ద విజయోత్సవ సభ కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ సమితి రాష్ట్ర నాయకుడు కంచర్ల సుధాకర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అసెంబ్లీలో చట్టం చేయాలని డిమాండ్ చేశారు. మాదిగలైన బి కేటగిరి వారికి విద్య, ఉద్యోగాల్లో ఏడు శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. విజయోత్సవ సభకు రాష్ట్ర అధ్యక్షుడు దండు వీరయ్య మాదిగ హాజరుకానున్నట్లు తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు చాట్ల అర్జునరావు, పరిసిపోగు పోలయ్య, రాయర్ల ప్రభాకరరావు, పేరయ్య, గంధం సైమన్ బాబు, కోలంటి రవిబాబు పాల్గొన్నారు.

## కైకలూరులో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే



భుజబలపట్నంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న బృందం సభ్యులు





కైకలూరు పంచాయతీలో మరుగుదొడ్డిని పరిశీలిస్తున్న బృందం సభ్యులు

**కైకలూరు:** స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే – 2025 బృందం మండలంలోని కైకలూరు, భుజబలపట్నం గ్రామాల్లో శనివారం సర్వే చేసింది. పంచాయతీ కార్యాలయం, అంగన్‌వాడీ కేంద్రం, పాఠశాలలు, చర్చి, హిందూ ఆలయం, మసీదు, హెల్త్ సెంటర్, వ్యక్తిగత మరుగుదొడ్లు, హెల్త్ సెంటర్, చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను బృందం సభ్యులు పరిశీలించారు. బృందం స్టేట్ కో–ఆర్డినేటర్ ఎస్ సందీప్ మాట్లాడుతూ స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 అనేది స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ్) రెండో దశకు సంబంధించిందని చెప్పారు. కేంద్ర జల్ శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ పారిశుద్ధ్య సర్వే, పారిశుద్ధ్య పరిమితుల ఆధారంగా రాష్ట్రాలు, జిల్లాలకు ర్యాంక్‌ల కోసం కేంద్రానికి నివేదిస్తామని చెప్పారు. గ్రామాలు, గృహాలు, ప్రజా ప్రదేశాల మూల్యాంకనం, వాటి పరిశుభ్రత స్థితిని అంచనా వేస్తామని తెలిపారు. కై కలూరు మండలంలో కైకలూరు, భుజబలపట్నం గ్రామాలు సర్వే నిమిత్తం ఎంపిక చేశారని చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు రవికిరణ్, ప్రసాద్, స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ సర్వే సూపర్‌వైజర్ పి.సత్తిబాబు, సర్వేయర్లు బి.సునీల్, కె.శ్రీనివాస్, శివకుమారి పాల్గొన్నారు.

## అట్టహాసంగా ఆషాఢ సారె సంబరం

- 20మంది వేదపండితులతో లక్ష మల్లెలతో అర్చన
- ప్రసన్న గణపతి గుడి నుంచి అమ్మవార్ల సారె ఊరేగింపు



కన్యకాపరమేశ్వరి, పార్వతీదేవికి సారె ఊరేగింపుతో తరలివస్తున్న ఆర్యవైశ్య మహిళలు

**నాగాయలంక:** ఆషాఢమాసం పర్వదినాలు పురస్కరించుకుని మండల ఆర్యవైశ్య సంఘం, శ్రీవాసవీ సేవాదళ్ యూత్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక శ్రీపార్వతీ సమేత శ్రీకన్యకా పరమేశ్వరీ సమన్విత శ్రీనగరేశ్వరస్వామి ఆలయంలో శనివారం ఆషాఢ సారె సంబరం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ చైర్మన్ చిట్టా సాంబశివరావు పర్యవేక్షణలో శ్రీనగరేశ్వరస్వామి, కన్యకాంబ, పార్వతీదేవి మూల విరాట్‌లను ఆధ్యాత్మిక శోభతో అలంకరించారు. ఆలయ అర్చకుడు కొల్లిపర సుబ్బారావు, ముదునూరి అచ్యుతశేఖరశర్మ బ్రహ్మత్వంలో ప్రధాన పీఠం వద్ద ఆర్యవైశ్య సంప్రదాయ రీతిలో చిట్టా శివనాగేశ్వరరావు–రాజేశ్వరి దంపతులతో ఆషాఢ పూజ జరిపారు. ఈ సందర్భంగా తొలుత 20మంది వేద పండితులతో అమ్మవార్లు ఇరువురికి లక్ష మల్లెలతో విశేషార్చన నిర్వహించారు. తొలుత గ్రామంలోని ప్రసన్న గణపతి దేవస్థానం నుంచి సారె పళ్లాలతో ఆర్యవైశ్య మహిళలు, భక్తులు ఊరేగింపుగా తరలివచ్చి చీర, రవిక, గాజులు, పసుపు, కుంకుమ, పండ్లు, మిఠాయిలను నగరేశ్వరుని ఆలయంలో అమ్మవార్లకు సమర్పించారు. అన్నపూర్ణయ్య, దేసు సత్యనారాయణ, తాడికొండ సత్యనారాయణ, చిట్టా వెంకట శేఖర్, వంకాయల ఆదిరాజేష్, వాసవీ సేవాదళ్ యూత్ సభ్యులు, ఆర్యవైశ్యసంఘం నాయకులు, సంకర్షణ భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## స్మార్ట్ మీటర్ల ఏర్పాటును అడ్డుకున్న స్థానికులు



విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ధర్నా

**(విజయవాడసెంట్రల్):** ప్రజల అనుమతి లేకుండా నిరుపేద, పేద దళిత వర్గాల ప్రజలు అధికంగా ఉండే 31వ డివిజన్ అంబేడ్కర్ కాలనీలో ఇళ్లకు అడ్డగోలుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారు. స్మార్ట్ మీటర్ల బిగింపును పెద్దలు, స్థానికులు వ్యతిరేకించారు. దీంతో వారు ఇళ్లకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. విద్యుత్ భారాలు, స్మార్ట్ మీటర్లను వ్యతిరేకిస్తూ అంబేడ్కర్ కాలనీలో స్థానిక ప్రజలతో కలిసి సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సీపీఎం సెంట్రల్ సిటీ కమిటీ సభ్యులు ఎం.బాబూరావు మాట్లాడుతూ అంబేడ్కర్ కాలనీలో నిరుపేద దళిత కుటుంబాలకు బలవంతంగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని తెలిపారు. విద్యుత్తు అధికారులు ఇంటింటికీ తిరుగుతూ మీటర్ రిపేరు వచ్చిందని, పాత మీటర్ తొలగించి స్మార్ట్ మీటర్ బిగిస్తున్నామని చెబుతున్నారన్నారు. ఇళ్లకు స్మార్ట్ మీటర్ల వద్దని అడ్డగించిన ప్రజల ఇళ్లకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం దుర్మార్గమన్నారు. దీనిపై ఉన్నత అధికారులకు ఫోన్ చేసి ప్రశ్నించగా ఇళ్లకు విద్యుత్ వైర్లు కలిపామని చెప్పారన్నారు. ప్రజలు ఇళ్లల్లో లేని సమయం చూసి దొంగచాటుగా స్మార్ట్ మీటర్లు బిగిస్తున్నారని ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం స్థానికులతో కలిసి ముత్యాలంపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన ధర్నా నిర్వహించారు. తమ ఇళ్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తే సహించబోమని తేల్చి చెప్పారు. సీపీఎం 31వ డివిజన్ కార్యదర్శి జి.నాగరాజు, నాయకులు జి.మోతి, కిరణ్ కుమార్, సీహెచ్. కృష్ణారావు, ఎం.బాబూరావు పాల్గొన్నారు.